# అమెరికా సామ్రాజ్యవాదంతో చేసుకున్న సైనిక ఒప్పందాలన్నీ రద్దుచేయాలి

**సెప్టెంబర్** మొదటి వారంలో అమెరికాతో చేసుకున్న నాలుగింటిలోని మూడు 'మౌలిక' ఒప్పందాలలో భాగంగా 'సమాచార సంబంధాలు మరియు రక్షణ ఒప్పందం' (సిఓఎమ్‌సిఎస్‌ఏ- 'కోమ్‌కాసా')పై మనదేశం సంతకాలు చేసింది. దీనర్థం ఏమిటంటే, 'నాటో' దేశాలతోపాటు దాదాపు సమానస్థాయిలో అమెరికా సామ్రాజ్యవాదంయొక్క యుద్ధ భాగస్వామిగా మనదేశం అంగీకరించట మన్నమాట! నాలుగింటిలో చివరిదైన భూ, అంతరిక్ష రంగాలలో పరస్పర మౌలిక సహకార ఒప్పందం (బిఇసిఏ)పై త్వరలో ఒప్పందం జరగనుంది. అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య వ్యూహానికి అనుగుణంగా భారతదేశాన్ని మన దేశ పాలకులు ఏవిధంగా లోబరుస్తున్నారో ఈ అంశాలు స్పష్టం చేస్తున్నాయి.

2005లో యుపిఏ-1 ప్రభుత్వం కుదుర్చుకున్న భారత-అమెరికా రక్షణ పరిధి ఒప్పందం, అణుఒప్పందానికి ముందస్తు సూచికగా నిలిచింది. 2015లో మోడీ ప్రభుత్వ ఏర్పాటు తదనంతరం, ఒబామా భారతదేశ పర్యటన సందర్భంగా, ఆసియా-పసిఫిక్ మరియు హిందూ మహాసముద్ర ప్రాంతాల సంయుక్త దర్శన ప్రకటనపై మనదేశం సంతకం చేసింది. అంటే, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా వ్యూహంలో మనదేశం భాగం పంచు కుంటున్నట్లుగా ప్రకటించటమే. దీనికి అనుగుణంగా 2016 సం॥లో అమెరికా తన 'నాటో' భాగస్వామ్య దేశాలను, ఆసియాలోని జపాన్‌వంటి తన మిత్రదేశాలను పరిగణించేవిధంగా గొప్ప రక్షణ భాగస్వామిగా పరిగణిస్తూ మనదేశానికి యోగ్యతా పత్రమిచ్చింది. 2015లో మోడీ ప్రభుత్వం అమెరికాతో రక్షణ పరిధి ఒప్పందాన్ని మరో పది సం॥ల కాలం పునరుద్ధరించింది. దీని వెన్నంటే 'లాజిస్టిక్ ఎక్స్‌ఛేంజ్ మెమోరాండం ఆఫ్ ఎగ్రిమెంట్' (ఎల్‌ఇఎమ్‌ఓఏ) పై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందంద్వారా అమెరికా యుద్ధనౌకలు, సైనిక విమానాలు భారత వైమానిక, నావికా స్థావరాలలోని ఇంధనం తిరిగి నింపుకునేందుకు, మరమ్మత్తులు చేసుకునేందుకు ఇకపై ఎల్లవేళలా వీలు కల్పిస్తోంది. మూడవ ప్రపంచ దేశాలపై అమెరికా సాగించే సైనిక చర్యల సందర్భంగా అమెరికా యుద్ధవిమానాలు, నౌకలు భారత స్థావరాలలో సౌకర్యాలను ఈ ఒప్పందంద్వారా వినియోగించుకోవచ్చు.

సెప్టెంబర్ 6న భారత - అమెరికా దేశాల నడుమ ఇద్దరు చొప్పున మంత్రిత్వ స్థాయి సమావేశాలు జరిగాయి. అమెరికా విదేశాంగశాఖ మంత్రి మైక్ పాంఫియో, రక్షణశాఖామంత్రి జేమ్స్ మాటిస్‌లు న్యూఢిల్లీ వచ్చి మనదేశ కేంద్రమంత్రులు సుష్మాస్వరాజ్, నిర్మలా సీతారామన్‌లతో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో అధిక ఖర్చుతో కూడిన కీలక రక్షణ సాంకేతికత భారత సాయుధ బలగాలకు అందజేయబడుతుందని పేర్కొంటున్న 'కోమ్ కాసా' పై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందంతో వారు సరఫరా చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని తనిఖీ చేసేందుకు అమెరికాకు చెందిన సైనిక తనిఖీ అధికారులను నిరంతరాయంగా భారత సైనిక స్థావరాలలోకి భారతదేశం అనుమతించాలి. అదేవిధంగా మనదేశం మరో దేశంనుండి అనగా రష్యానుండి దీనికి సరితూగే సాంకేతికతను ఏ రూపంలోనూ కొనుగోలు చేయరాదు.

ఈ ఒప్పందం ప్రకారం, అమెరికా సైనిక అధికారులే మనదేశానికి సాంకేతిక సరఫరాను పర్యవేక్షించటంద్వారా నమ్మకం చెదిరిపోకుండా చూస్తారన్నమాట. ఈ ఒప్పందం అమెరికా సైనికాధికారులు మనదేశంలోని సైనిక స్థావరాలలో రక్షణ సమాచార వ్యవస్థను తనిఖీ చేయటానికి తెరచి వుంచుతోంది. అంతేగాక భారత సైన్యంలోని సమాచారాలను సైతం అమెరికా నియంత్రించేలా చేస్తోంది. ఇంకా, రష్యావంటి దేశాలనుండి దిగుమతి చేసుకున్న అధునాతన ఆయుధాలు, ఇతర ఆయుధ వ్యవస్థలతో పొంతనలేని విధంగా వుండేట్లు ఈ ఒప్పందం హామీ ఇస్తోంది.

ఇద్దరేసి మంత్రుల స్థాయి సమావేశాల తర్వాత విడుదల చేసిన సంయుక్త ప్రకటన ప్రకారం, రానున్న కాలంలో అమెరికా వ్యూహాత్మక పథకాలకు భారతదేశం మరింతగా దాసోహం కానున్నది. రెండుదేశాల విదేశాంగశాఖ, రక్షణశాఖ మంత్రుల నడుమ అత్యంత వేగవంతమైన (హాట్‌లైన్) సమాచారవ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం జరిగింది. ప్రపంచంలోని ఇతర దేశాలన్నింటితో పోల్చి చూస్తే అమెరికా భారతదేశంతో అత్యధిక సంయుక్త సైనిక విన్యాసాలు జరిపింది. ఇప్పటివరకు, నావికా, వైమానిక, సైనిక విభాగాల నడుమ ఈ విన్యాసాలన్నీ విడివిడిగా నిర్వహింపబడ్డాయి. నావికా, వైమానిక, సైనిక బలగాలన్నింటితో కలసి త్రైపాక్షిక సైనిక విన్యాసాలు జరపాలని ఇద్దరేసి మంత్రుల స్థాయిలో జరిగిన ఈ ద్వైపాక్షిక సమావేశం నిర్ణయించింది.

అమెరికా కేంద్ర నావికా దళానికి, భారత నావికా ప్రధాన కార్యాలయానికి మధ్య ఇచ్చి పుచ్చుకునే తరహాలో చర్చలు ప్రారంభించాలనటం, ఆసియాఖండంలో అమెరికా వ్యూహంతో భారత దేశం ఎంతగా సంలీనమౌతుందో స్పష్టంచేస్తోంది. అమెరికా నావికాదళం తన సైనిక పథకంలో మనదేశాన్ని ఇముడ్చుకునే వంచనలో భాగంగానే తన పసిఫిక్ నావికాదళం పేరును 'ఇండో-పసిఫిక్ నావికా దళం'గా మార్పుచేసుకుంది. కనుక, 2018 జూన్‌లో పేరుమార్పు జరుపుకున్న పసిఫిక్ నావికా దళానికి ఒక భారత నావికా అధికారి హాజరై, మన నావికా దళాన్ని దానిలో భాగం పంచుకునేట్లు చేయటం ఆశ్చర్యకరమేమీ కాదు.

అమెరికాతో సైనిక, వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా భారతదేశ భూభాగాన్ని ఆధారంచేసుకొని ఆసియాపై ఆధిపత్యం నెరపాలనే అమెరికా సామ్రాజ్యవాదుల వ్యూహంలో మనదేశాన్ని భాగంచేయటం, భారత ప్రజల పాలిట వినాశకారిగా మారుతుందని రుజువవుతోంది.

మోడీ ప్రభుత్వ ఈ అన్ని సైనిక ఒప్పందాల నుండి వెనక్కు రావాలని సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటి డిమాండ్‌చేస్తూ, అమెరికా సామ్రాజ్య వాదంతో ముడివేసుకున్న ఈ సైనిక ఒప్పందా లన్నింటిని వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపు నిస్తోంది.

oooo